క్లుప్తంగా

ఆరెస్సార్‌కు పరామర్శ



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 20వ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు (ఆరెస్సార్)ను పార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళి శనివారం పరామర్శించారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



నెల్లూరు(దర్గామిట్ట): కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన తారక లక్ష్మీభవాని చదువు నిమిత్తం రూ.35 వేలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం అందజేశారు. నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో మహాకవి గురజాడ అప్పారావు జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తిరుపతి 'శ్వేత' పూర్వసంచాలకుడు డాక్టర్ భూమన్, కుట్టి విద్యాసంస్థల అధినేత లతీఫ్ కుట్టి, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సాహితీవేత్త కాళిదాసు పురుషోత్తం, మెట్టు రామచంద్ర ప్రసాద్, నలుబోలు బలరామయ్యానాయుడు, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, విరసం చెంచయ్య, శేషగిరీశం, ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ



నెల్లూరు(బారకాసు): తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీని పలువురు పద్మశాలి సంఘ నేతలు స్మరించుకున్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని శోధన్‌నగర్‌లోని మనం హాస్పిటల్లో ఆయన చిత్రపటానికి శనివారం నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ బూధాటి రాధయ్య, సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాలయ్య, జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంతం, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్, డాక్టర్ మారం సుధాకర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్ పోటీలు నేడు

నెల్లూరు (టౌన్): యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో గల యూటీఎఫ్ కార్యాలయంలో క్యారమ్స్ టోర్నీని ఆదివారం నిర్వహించనున్నామని జిల్లా కార్యదర్శి చలపతిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా హరివర్మ



నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా హరివర్మ బాధ్యతలను శనివారం చేపట్టారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఒంగోలుకు ఇటీవల బదిలీ అయిన విషయం విదితమే. ఈ క్రమంలో ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా నెల్లూరు ఆడిట్ రిజిస్ట్రార్ హరివర్మ విధులు నిర్వర్తించనున్నారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారుల పర్యవేక్షణలో ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, 12 మంది సబార్డినేట్స్, ఒక షరాబుకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను అర్ధరాత్రి వరకు జరిపారు. జాబితాను అధికారులు ఆదివారం ప్రకటించనున్నారు.

• జిల్లాకు సంబంధించిన సీనియర్ అసిస్టెంట్లు, సబ్ రిజిస్ట్రార్ల బదిలీల కౌన్సెలింగ్‌ను గుంటూరులోని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించనున్నారు.

కళావిహీనంగా స్వర్ణాల ఘాట్



ఘాట్ వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క



నిల్వ ఉన్న చెత్తాచెదారాలు

- గుర్రపు డెక్క, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా
- చెరువులోకి దిగేందుకు జంకుతున్న భక్తులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువు కళావిహీనంగా తయారైంది. వాస్తవానికి రొట్టెల పండగ సమయాన ఇక్కడికి లక్షలాది మంది భక్తులు వచ్చి తమ కోర్కెల రొట్టెలను వదులుతారు. పలువురు భక్తులు రోజూ వస్తుంటారు. అయితే రొట్టెల పండగ మినహా మిగిలిన రోజుల్లో స్వర్ణాల చెరువు ఘాట్, పరిసరాల పరిశుభ్రతను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఘాట్‌లో గుర్రపుడెక్క పెరిగిపోయి, చెత్తా చెదారంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. చెరువులో ఏర్పాటు చేసిన వల తెగిపోవడంతో ఘాట్ సమీపంలోకి మురుగు చేరుతోంది.

దుర్గంధం

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ముందుగా స్వర్ణాల చెరువులోకి వెళ్లి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకున్నాక దర్గాకు వెళ్తుంటారు. అయితే ఇక్కడ అపరిశుభ్రత నెలకొనడంతో పాటు దుర్గంధం వస్తుండటంతో చెరువులోకి దిగాలంటేనే భక్తులు జంకుతున్నారు.

హామీలు.. నీటి మూటలు

బారాషహీద్ దర్గాతో పాటు స్వర్ణాల చెరువు ఘాట్‌ను సుందరీకరించి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చి అన్ని వసతులను కల్పిస్తామనే ప్రజాప్రతినిధుల హామీలు నీటి మూటలుగా మారుతున్నాయి. రొట్టెల పండగ అనంతరం ఈ ప్రాంతం వైపు ఎవరూ దృష్టి సారించడంలేదు. మరోవైపు ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని భక్తులు వాపోతున్నారు. రాత్రి వేళ పెద్ద సంఖ్యలో యువకులు, ఆకతాయిలు ఇక్కడికి చేరుకొని మద్యం సేవిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి దర్గా ప్రాంగణంతో పాటు స్వర్ణాల చెరువు ఘాట్‌ను సుందరీకరించాలని పలువురు కోరుతున్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలను ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డెమో అధికారి కనకరత్నం శనివారం చేపట్టారు. సాయిపథం, విజయ ఆస్పత్రులు.. సరస్వతి, సింహపురి, క్రిస్టల్ స్కాన్ సెంటర్లలో తనిఖీలు జరిపి రికార్డులు, ఫారమ్ – ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని స్పష్టం చేశారు. స్కానింగ్ పరీక్ష చేసిన గర్భిణుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసి నివేదికలను ప్రతి నెలా రెండో తేదీలోపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. క్షయ నివారణ జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ విజయకుమార్ పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయం



ఉపన్యసిస్తున్న పీర్ నవాజ్

నెల్లూరు(బృందావనం): మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని జీవించాలని సూఫీ మతగురువు మొహమ్మద్ పీర్ నవాజ్ పేర్కొన్నారు. మిలాద్ – ఉన్ – నబీని పురస్కరించుకొని నగరంలోని కోటమిట్ట యూసుఫియా మసీద్ సెంటర్‌లో నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు.

24న సంగీత విభావరి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మృత్యర్థం నగరంలోని పురమందిరంలో వివిధ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించనున్నామని సింహపురి సంస్కృతి సమాఖ్య (సింసం) వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సాలూరు వాసురావును ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అవార్డుతో సత్కరించనున్నామని వివరించారు. వివిధ రంగాలకు చెందిన ఐదుగురికి సింసం పురస్కారాలను అందజేయనున్నామని తెలిపారు. 20 మంది గాయకులతో సంగీత విభావరిని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రసాద్‌బాబు, గాయకుడు రామచంద్రరావు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ ఎక్స్‌పోకు విశేష స్పందన



నెల్లూరు(బృందావనం): వనంతోపు సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ షాపింగ్ ఎక్స్‌పోకు విశేషాదరణ లభిస్తోందని నిర్వాహకుడు కైజర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. బెంగాలీ కాటన్, జైపూర్ స్టోన్ జ్యువెలరీ, సహారన్‌పూర్ ఉడెన్ ఫర్నిచర్, భాగల్పూర్ సిల్క్ తదితరాలను ప్రదర్శనలో ఉంచామని చెప్పారు. రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి పది గంటల వరకు ఎక్స్‌పో ఉంటుందని వివరించారు.

వైఎస్సార్‌సీపీతోనే పయనిస్తాం



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో నేతలు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎవరు వీడినా, తాము మాత్రం ఇక్కడే కొనసాగుతామని పలువురు కార్పొరేటర్లు, పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. చంద్రశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలను తెలియజేశారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, 8, 44, 46, 50వ డివిజన్ల కార్పొరేటర్లు కామాక్షిదేవి, నీలి రాఘవరావు, వేలూరు మహేష్, జయలక్ష్మి, 45వ డివిజన్ ఇన్‌చార్జి నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో పలువురు పార్టీ నేతలు అభినందనలను తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. 48వ డివిజన్ మైనార్టీ నేత సిద్ధిక్, 42వ డివిజన్‌కు చెందిన నేతలు షాకీర్‌బాబా, ఆసిఫాబేగం, వావిలేటి ప్రసన్న, 43వ డివిజన్ నేతలు సమీర్‌ఖాన్, జియాఉల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): ప్రపంచ అల్జీమర్స్ డేను పురస్కరించుకొని బుజబుజనెల్లూరులోని అస్థాన చిష్టియా మహిళా మండలి వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఫోనిక్స్ స్పెషాల్టీ హాస్పిటల్, డాక్టర్ వైష్ణవి న్యూరో స్పెషాల్టీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కార్యదర్శి శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, మురళి, సురేష్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు ఆసిఫ్ పాల్గొన్నారు.

సోదరులపై దాడి

నెల్లూరు(క్రైమ్): పుట్టిన రోజు వేడుకల పేరిట ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించిన వ్యక్తితో పాటు అతని తమ్ముడిపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని మసీదు సెంటర్ సమీపంలో అబ్దుల్, మున్నా, ఫయాజ్ మరికొందరు తమ స్నేహితుడు ముజ్జు పుట్టినరోజు వేడుకల పేరిట బాణసంచా కాల్చుతూ శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున రచ్చ చేశారు. అదే ప్రాంతానికి చెందిన ముతహర్ ఇలా ఎందుకు చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. ఆగ్రహించిన అబ్దుల్, మున్నా, ఫయాజ్ మరికొందరు అతనిపై, అడ్డొచ్చిన అతని సోదరుడిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేకే ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఖుద్దూస్‌నగర్‌కు చెందిన హుసునూరా భర్త వేధింపులు తాళలేకే స్వర్ణాల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారనే అంశం పోలీసుల విచారణలో వెల్లడైంది. ఖుద్దూస్‌నగర్‌కు చెందిన అబ్దుల్ వహీద్, హుసునూరా (29) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. వహీద్ చికెన్ స్టాల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. దంపతుల నడుమ విభేదాలతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఈ నెల 18న బారాషహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువులో ఆమె మృతదేహం లభ్యమైంది. ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డార నే అంశం విచారణలో తేలడంతో సెక్షన్లు మార్పు చేశామని పోలీసులు వెల్లడించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పెద్దబజార్‌లోని కుమ్మరవీధిలో నివాసం ఉంటున్న సయ్యద్ బైక్‌పై బారకాస్ సెంటర్ వైపు ఈ నెల 17న బయల్దేరారు. ఆ సమయంలో ఓ మహిళ అకస్మాత్తుగా రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆయన సడన్ బ్రేక్ వేశారు. దీంతో సయ్యద్‌తో సదరు మహిళ గొడవకు దిగారు. అనంతరం మసీదుకు ఈ నెల 19వ తేదీ రాత్రి నడిచి వెళ్తుండగా, కలెక్టరాఫీస్ గేట్ వద్ద ఆయన్ను సదరు మహిళ ఫోన్లో ఫొటో తీశారు. గమనించిన సయ్యద్ ఆమెను ప్రశ్నించగా, ఐదు నిమిషాలుంటే మావాళ్లు వచ్చి చెప్తారని బదులిచ్చారు. మసీదుకెళ్లి తిరిగి బయటకు రాగా, టీ అంగడి వద్ద సదరు మహిళ భర్త మరికొందరు వేచి ఉన్నారు. తన భార్యను దుర్భాషలాడావంటూ మహిళ భర్త, మరికొందరు సయ్యద్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో భర్తీ కాని సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకొని ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింకు ద్వారా ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏమైనా సందేహాలుంటే సమీపంలోని ఐటీఐను సంప్రదించాలని సూచించారు. ప్రవేశం పొందే ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 27న చేయించుకోవాలన్నారు. 28న ప్రభుత్వ, 30న ప్రైవేట్ ఐటీఐల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారని చెప్పారు.

కార్మికుల సేవలు అభినందనీయం



కార్మికులకు వస్త్రాలను అందజేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో దాదాపు పది రోజుల పాటు పారిశుధ్య పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టిన నెల్లూరు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలను కమిషనర్ సూర్యతేజ కొనియాడారు. సహాయక చర్యల్లో పాల్గొన్న 325 మంది కార్మికుల సేవలకు గౌరవార్థంగా నూతన వస్త్రాలు తదితరాలను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కమిషనర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయవాడలోని 61వ డివిజన్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేకాధికారిగా తనకు బాధ్యతలను అప్పగించారని తెలిపారు. విధులను పూర్తి స్థాయిలో నిర్వర్తించేందుకు ఇక్కడి పారిశుధ్య కార్మికులు ఎంతో సహకరించారని తెలిపారు. అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగానికి అందిన ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ విభాగాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను 94940 18118కు వాట్సాప్ ద్వారా లేదా 0861 – 2356777, 2316777 నంబర్లకు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరులోపు తెలియజేయాలని కోరారు. నిర్దేశించిన ఫోన్ నంబర్లను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు, సచివాలయ భవనాల్లో ప్రదర్శించాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని పార్టీ రూరల్ జేసీఎస్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సౌత్‌మోపూరు నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

• ఆనం విజయకుమార్‌రెడ్డిని పార్టీ 28వ డివిజన్ ఇన్‌చార్జి నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

కళాశాలలపై చర్యలకు డిమాండ్



వినతిపత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి సమయపాలన లేకుండా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఐఓ కార్యాలయంలో ఏఓకు వినతి పత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్పెషల్ క్లాసుల పేరుతో రాత్రి ఎనిమిది వరకు తరగతులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సెలవు దినాల్లో సైతం తరగతులను నిర్వహిస్తున్నా, ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు విష్ణు, జీవన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ నగర కమిటీ నియామకం



నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో బీటీఏ నగర నూతన కమిటీని శనివారం ఎంపిక చేశారు. నగర గౌరవాధ్యక్షుడిగా సుబ్బరాయుడు, సలహాదారుడిగా భాస్కర్‌రావు, నగరాధ్యక్షుడిగా పెంచలప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా నరేంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, కోశాధికారిగా రాంబాబు, నగర మహిళా కార్యదర్శులుగా వాణిశ్రీ, పద్మ, పెంచలమ్మ, శాంతి, జానాశైలజ, కనిమోళి తదితరులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా వేణుగోపాల్, తిరుపతయ్య, భాస్కరయ్య నియమితులయ్యారు.

నేటి నుంచి ఆలిండియా చెస్ టోర్నీ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రశాంతిరెడ్డి తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మైపాడు రోడ్డులోని కేపీఆర్ గ్రాండ్ కల్యాణ మండపంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న వైవీ రమణారెడ్డి స్మారక తృతీయ ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను జయప్రదం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ మాట్లాడారు. విజేతలకు ప్రోత్సాహకంగా రూ.2.25 లక్షల నగదు, సైకిళ్లు, స్మార్ట్ వాచీలు, జ్ఞాపికలను అందజేయడంతో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాన్ని కల్పించనున్నామని వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్): చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన అవసరమని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా సూచించారు. గుడ్. బ్యాడ్ టచ్, మైనర్ డ్రైవింగ్, సైబర్ నేరాలు, రక్షణ చట్టాలు తదితరాలపై ఎస్వీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యవసర సమయాల్లో 100, 112కు కాల్ చేస్తే తక్షణమే స్పందించి తగు చర్యలు చేపడతామని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు (టౌన్): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని డీఈఓ రామారావు పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలను శనివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, హెడ్ మాస్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై మంచి స్పందన



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: టీడీపీ ప్రభుత్వ 100 రోజుల పాలనపై రూరల్ నియోజకవర్గ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌లోని 33వ డివిజన్లో ఇంటింటికీ శనివారం వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్పొరేటర్ కరణం మంజుల, క్లస్టర్ ఇన్‌చార్జీలు మన్నెం పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, హజరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.